RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 280 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 07-5-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక : 280 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 07-5-2026 | పేజీలు : 8 | రూ: 2/-



## బెంచ్ మార్క్ సెట్ చేసేలా

# ఏపీ అభివృద్ధి చెందాలి

జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చంద్రబాబు దిశానిర్దేశం

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టే ప్రభుత్వ విధానమని ప్రకటించిన సీఎం

రాష్ట్ర అభివృద్ధిలో దేశానికి బెంచ్‌మార్క్‌గా నిలవాలని కలెక్టర్లకు దిశానిర్దేశం

ఫైళ్లు కదలడం కాదు, ఫలితాలు కదలాలంటూ పాలనలో వేగంపై స్పష్టత

గత ప్రభుత్వం నుంచి రూ.9.74 లక్షల కోట్ల అప్పులు వారసత్వంగా వచ్చాయని వెల్లడి

రూ.23 లక్షల కోట్ల ఒప్పందాలతో ఏపీకి గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి దిగ్గజ సంస్థలు



**సిటిజన్ టైమ్స్**

సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి.. ఈ మూడూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, ఈ ఔ-ఐ-ఔజ సైకిల్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారానే రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పాలనలో వేగం పెంచి, అభివృద్ధిలో సరికొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి సచివాలయంలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల 7వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్ ప్రగతికి స్పష్టమైన మార్గసూచీని ఆవిష్కరించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "గత పాలకుల నుంచి

తరువాయి 2లో..


## తిరుమల లడ్డు వ్యవహారంపై ఏపీ సర్కారు కీలక నిర్ణయం

*లడ్డూలో కల్తీ నెయ్యి అంశంపై ఇప్పటికే విచారణ జరిపిన ఏక సభ్య కమిటీ*

*ఈ కమిటీ నివేదికను అధ్యయనం చేసేందుకు హైలెవెల్ కమిటీని నియమించిన ప్రభుత్వం*

*వారంలోగా నివేదిక సమర్పించాలని ఉన్నత స్థాయి కమిటీకి ఆదేశం*

తరువాయి 2లో..



## పిఠాపురం టీడీపీ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి వర్మ తొలగింపు...

### టీడీపీ హైకమాండ్ సంచలన నిర్ణయం

*2024 ఎన్నికల తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో తరచుగా వివాదాలు*

*సీరియస్ గా దృష్టి సారించిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు*

*పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో కఠిన చర్యలు*



**పిఠాపురం, సిటిజన్ టైమ్స్**

2024 ఎన్నికల తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో తరచుగా వివాదాలు నెలకొంటుండడంపై టీడీపీ

తరువాయి 2లో..

## విహార నౌకలో హంటర్ కలకలం.. బెంబేలెత్తిస్తున్న వైరస్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అంటార్కిటికా ఖండం, అట్లాంటిక్ మహా సముద్రంలోని మారుమూల దీవులను సందర్శించడానికి 'ఎంవీ హోండియస్' క్రూయిజ్ నౌకలో బయల్దేరిన పర్యాటకులను 'హంటర్ వైరస్' బెంబేలెత్తిస్తోంది. నౌకలో 88 మంది పర్యాటకులు,

తరువాయి 2లో..




## 'సిందూర్'లో మన వాయుసేన సాహసం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

చుట్టూ చిమ్మచీకటి.. నలువైపులా పొంచి ఉన్న ఆపద.. కళ్లముందు కన్పిస్తున్న లక్ష్యం.. సరిగ్గా ఏడాది క్రితం మన వాయుసేన ముందున్న పరిస్థితి ఇది. అలాంటి విపత్కర క్షణాల్లో మన వీర జవాన్లు సాహసం చేశారు. అర్ధరాత్రి వేళ శత్రువు రక్షణ కోటను ఛేదించి ఉగ్రమూకల స్థావరాలను తునాతునకలుగా పేల్చేశారు. ఈ తెగువతోనే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో మన వాయుసేన.. దాయాది పాకిస్థాన్ వెన్నులో వణుకుపుట్టించింది. మే 6-7 అర్ధరాత్రి వేళ మన సైన్యం.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలపై మెరుపుదాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్‌ను ఎలా సాగించారు? ఇందులో ఎవరు పాల్గొన్నారు? ఏయే యుద్ధ విమానాలను వాడారు? అన్న వివరాలను తొలుత ఐఏఎఫ్ భద్రతా నిబంధనల రీత్యా వెల్లడించలేదు. అయితే, గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సిందూర్'లో పాల్గొన్న వీరులను గ్యాలంట్రీ పురస్కారాలతో

తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**


తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రెస్‌నోట్ విడుదల చేసింది. "ఇవాళ గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు" అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో నిన్న గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు (మెజార్టీ మార్క్) సమకూరిన అనంతరం రావాలని సూచించినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

**విజయ్‌కు అనుమతి ఇవ్వాలి..**

ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను

తరువాయి 2లో..

## చైనా రక్షణశాఖ మాజీ మంత్రులకు మరణశిక్ష



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అవినీతిపై చైనా ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా ఇద్దరు రక్షణశాఖ మాజీ మంత్రులకు మిలిటరీ కోర్టు మరణశిక్ష విధించింది. అవినీతి వ్యవహారంలో వీ ఫెంగే, లీ షాంగ్‌లపై ఈ మేరకు చర్యలు తీసుకుంది. లంచాలు స్వీకరించిన కేసులో ఫెంగే.. లంచాలు తీసుకోవడంతోపాటు ఇవ్వజూపిన కేసులో షాంగ్ దోషిగా తేలారు. అయితే.. ఈ శిక్ష అమలును కోర్టు

తరువాయి 2లో..

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

### మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన

పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం

హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వివరాలు డ్యాష్‌బోర్డులో అందుబాటు

త్వరలో ప్రజలకు సైతం ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని స్పష్టీకరణ

ఉత్తమ విధానాలకు కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామన్న సీఎం చంద్రబాబు

**సిటిజన్ టైమ్స్**

రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించబోతున్నట్టు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. అమరావతి సచివాలయంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో

తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# జనసేన ఒంటరి పోటీ ఎవరికి లాభం..?

ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున జరుగుతున్న ప్రచారం.. తమిళనాడులో విజయ్‌పార్టీ టీవీకే ఒంటరిగా నిలిచి సత్తా చాటిందని.. ఏపీలో మాత్రం జనసేన ఒంటరిగా పోటీ చేసేందుకు వెనుకంజ వేస్తోందని!. దీనిలో వాస్తవం లేకపోలేదు. 2019 ఎన్నికల్లో జనసేన దాదాపు ఒంటరిగానే బరిలో నిలిచింది. కమ్యూనిస్టులు, బీఎస్పీ వంటి వాటితో పొత్తు పెట్టుకున్నా.. అవి పెద్దగా లెక్కలోకిరాలేదు. ఒకరకంగా జనసేన ఒంటరి పోరాటమే చేసింది. కానీ, ఫలితం దక్కలేదు. దీంతోనే 2024లో పట్టుబట్టి టీడీపీం బీజేపీలను ఒకే వేదికపైకి చేర్చి జనసేన పోటీ చేసింది. తద్వారా తాను లబ్ధిపొంది.. ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది. ఇదే ఫార్ములాను వచ్చే 15 సంవత్సరాలు కూడా అమలు చేయాలన్నది జనసేన వ్యూహం. కానీ, ప్రత్యర్థులు.. అదేసమయంలో రాజకీయ విశ్లేషకులు మాత్రం జనసేన ఒంటరిగా ఎందుకు పోటీ చేయదంటూ.. మళ్లీ ప్రశ్నిస్తున్నారు. దీనికి విజయ్‌ను ఉదాహరణగా చూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన ఒంటరిగా పోటీచేస్తే.. ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అనే ప్రశ్నలు తెరమీదికి వస్తున్నాయి. ఈ దఫా జనసేన ఒంటరిగా పోటీచేస్తే.. ఆ పార్టీకి ఖచ్చితమైన లాభం ఉంటుందన్న అంచనాలు వస్తున్నాయి. 2019లో లెక్కవేరు.. ప్రస్తుత లెక్క వేరని పరిశీలకులు చెబుతున్నారు. గత రెండేళ్ల కాలంలో పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా.. ఇతర శాఖ లమంత్రిగా చేస్తున్న పనులు, రాజకీయంగా పార్టీలో కొన్ని ఒడిదుడుకులు వచ్చినా.. ఆయన పాటిస్తున్న సంయమనం వంటివి సాధారణ ప్రజలను కూడా మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఇక, అభివృద్ధిపరంగా కూడా.. పంచాయతీలను డెవలప్ చేస్తున్నారు. అంటే.. 2019 ఎన్నికల సమయంలో పవన్‌పై ఉన్న ఇమేజ్‌కు భిన్నంగా ఇప్పుడు పాలన పరంగా ఆయన ఇమేజ్ పెరిగిందన్న వాదన వినిపిస్తోంది. దీనికితోడు.. జనసేనలో క్షేత్రస్థాయి ఎమ్మెల్యే ల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ.. పార్టీ అధినేతగా పవన్‌కు ఎలాంటి మచ్చలు మరకలు లేవు. పైగా.. గ్రామీణ, గిరిజన, ఎస్సీ సామాజికవ ర్గాలకు ఆయన మరింత చేరువ అయ్యారు. పట్టణాలు, నగరాల్లోనూ -ఫీల్ గుడ్ లీడర్-గా చూస్తున్నారు. ఈ పరిణామాలతో జనసేన కనుక ఒంటరిగా పోటీ చేసినా.. ఆ పార్టీకి లాభం చేకూరుతుందని మెజారిటీ విశ్లేషకులు చెబుతున్నారు. పైగా వైసీపీకి ఇది భారీ దెబ్బ అని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఏదైనా ఉంటే.. అది ఈ దఫా జనసేనకు పడుతుందని కూడా చెబుతున్నారు.

## తమిళనాట అదే సందిగ్ధత..

# మళ్లీ విజయ్‌కు తిరస్కరణ..

కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తంచేసింది.

**సీఎం కాన్వాయ్ వద్దు: విజయ్**

ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# చిమ్మచీకట్లో.. శత్రువు రక్షణ కోటను ఛేదించి

సత్కరించారు. ఆ సమయంలో కేంద్రం వెలువరించిన ప్రకటనతో ఈ ఆపరేషన్‌కు సంబంధించిన కొన్ని వివరాలు బహిర్గతమయ్యాయి.

**తక్కువ ఎత్తులో ప్రయాణించి..**

'సిందూర్' సమయంలో పాక్‌లోని చాలా లక్ష్యాలపై మన బలగాలు దాడులు చేశాయి. అన్నింటికంటే ముందు పాక్ రక్షణవ్యవస్థను ఛేదించి ఉగ్రముతాల స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. సాధారణంగా ఈ స్థావరాల వద్ద పాక్ మిలిటరీ నిరంతరం పహారా కాస్తుందనే సమాచారం ఉంది. దీంతో శత్రు దేశ గగనతల రక్షణ వ్యవస్థల కంటపడకుండా ఉండేందుకు మన వాయుసేన విమానాలు అత్యంత తక్కువ ఎత్తులో ప్రయాణించాయి. ఇది చాలా సవాలుతో కూడుకున్నది. ఒకవేళ రాడార్ నిఘా వ్యవస్థలు గుర్తిస్తే కింద నుంచి ఈ విమానాలను శత్రుసైన్యం లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంటుంది. అయినప్పటికీ మన వాయుసేన యుద్ధవిమానాలు సాహసోపేతంగా ప్రయాణించాయి. తక్కువ సమయంలో పాక్ రక్షణ వ్యవస్థను ఛేదించి అత్యంత కచ్చితత్వంతో 9 ఉగ్ర స్థావరాలపై బాంబులు కుమ్మరించాయి. ఈ దాడుల్లో లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్‌కు చెందిన పలు స్థావరాలు పూర్తిగా నేలమట్టమయ్యాయి.

**తొమ్మిది మందికి 'వీరచక్ర' పురస్కారాలు..**

ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న తొమ్మిది మంది ఐఏఎఫ్ అధికారులను కేంద్రం 'వీర చక్ర' పురస్కారాలతో సత్కరించింది. సుఖోయ్ 30 ఎంకేఐ, జాగ్వర్, తేజస్, మిరేజ్-2000, మిగ్-29 వంటి యుద్ధ విమానాలతో వీరు 'సిందూర్'లో పాల్గొన్నారు. ఈ స్క్వాడ్రన్‌కు గ్రూప్ కెప్టెన్ మనీశ్ అరోరా కమాండింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. శత్రువు నిఘా నుంచి తప్పించుకుని పలు లక్ష్యాలపై గగనతల దాడులు నిర్వహించారు. శత్రువు ప్రతిఘటించలేని విధంగా అరోరా బృందం భీకర దాడులు జరిపిందని పురస్కార ప్రకటన సందర్భంగా కేంద్రం వెల్లడించింది. ఇక, మరో గ్రూప్ కెప్టెన్ కునాల్ కల్రా కూడా ప్రతికూల పరిస్థితుల్లో రెండు లక్ష్యాలను ఛేదించారు. తొలి లక్ష్యంగా కునాల్ బాంబులను జారవిడిచిన తర్వాత.. ఆయన ప్రయాణించిన యుద్ధ విమానంలో సాంకేతిక సమస్య ఎదురైంది. అయినప్పటికీ ఆయన వెనక్కి రాకుండా తన ఆయుధ వ్యవస్థను రీసెట్ చేసి రెండో లక్ష్యంపై దాడి జరిపారు. స్క్వాడ్రన్ లీడర్ సార్థక్ కుమార్ మరో కీలక పాత్ర చేపట్టారు. ఆపరేషన్ తొలి రోజున పక్కా ప్రణాళిక, కచ్చితమైన నిఘా సమాచారంతో శత్రుదేశ నెట్‌వర్క్‌లో చాలా లోపలివరకు వెళ్లి లక్ష్యాలపై దాడులు చేశారు. ఆ మరుసటి రోజు కూడా దీర్ఘశ్రేణి దాడులు జరిపారు. మరో స్క్వాడ్రన్ లీడర్ సిద్ధాంత్ సింగ్ అత్యంత తక్కువ ఎత్తులో ప్రయాణించి భారీ స్థాయిలో బాంబులను జారవిడిచింది. ఆ సమయంలో శత్రు దేశం నుంచి ప్రతిస్పందన ఎదురైనా.. ఆయన వెరవకుండా లక్ష్యాలను ఛేదించి తిరిగొచ్చారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న ఫైటర్ స్క్వాడ్రన్‌కు గ్రూప్ కెప్టెన్ రంజీత్ సింగ్ సిధు కమాండర్‌గా వ్యవహరించారు. ఇక, వింగ్ కమాండర్ జాయ్ చంద్ర, స్క్వాడ్రన్ లీడర్ రిజ్వాన్ మాలక్, ఫ్లైట్ లెఫ్టినెంట్ అర్షవీర్ సింగ్ ఠాకూర్ కూడా అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో శత్రుదేశ రక్షణ వ్యవస్థలోకి వెళ్లారు. భూఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి విభాగానికి గ్రూప్ కెప్టెన్ అనిమేశ్ పట్ని కమాండర్‌గా పనిచేశారు. శత్రువుల నుంచి ఎదురయ్యే ప్రతిదాడులను అడ్డుకోవడంలో ఈయన కీలక పాత్ర పోషించారు.

## బెంచ్ మార్క్ సెట్ చేసేలా

# ఏపీ అభివృద్ధి చెందాలి

రూ.9.74 లక్షల కోట్ల అప్పులు, రూ.1.30 లక్షల కోట్ల పెండింగ్ బిల్లులు మనకు వారసత్వంగా సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించింది. వారి నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలమయమైన రోడ్లతో విధ్వంసమైంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి అందరి సహకారంతో గట్టెక్కి, వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టగలిగాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

**అభివృద్ధి, సంపదతోనే సంక్షేమం**

డబ్బులు లేవని చెప్పడం కాదని, వినూత్నంగా ఆలోచించి సంపద సృష్టించడంపై దృష్టి పెట్టాలని సీఎం పిలుపునిచ్చారు. "వెల్ఫేర్, డెవలప్‌మెంట్, వెల్త్ క్రియేషన్ (ఔ-ఊ-ఔఛ) అనేది ఒక సైకిల్ లాంటిది. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు భద్రత, భరోసా కల్పించాం. ఇప్పుడు పారిశ్రామిక ప్రగతి (ౡ4) ద్వారా ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం" అని ఆయన తెలిపారు. 26 కొత్త పారిశ్రామిక విధానాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీపై నమ్మకాన్ని కల్పించామని అన్నారు. "కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడపడం ఒక గర్వకారణంగా భావించేవాళ్లం. ఇప్పుడు అదే సంస్థను ఏపీకి తీసుకురాగలిగాం. రాష్ట్రంలో రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకునే స్థాయికి చేరుకున్నాం. ఇప్పటికే రూ.23 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లోనూ ముందుకు దూసుకెళ్తున్నాం" అని చంద్రబాబు వివరించారు.

**ఫైళ్లు కాదు.. ఫలితాలు కదలాలి**

పాలనలో వేగం, జవాబుదారీతనం అత్యంత కీలకమని సీఎం ఉద్ఘాటించారు. "స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది కేవలం నినాదానికే పరిమితం కారాదు. 'ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్' (ఫైళ్లు కాదు, ఫలితాలు కదలాలి) అనేదే మన విధానం కావాలి. ప్రజల నుంచి వచ్చిన ఆర్థికేతర ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాల్సిందే" అని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. "ఆఫీస్ చెప్పేది డేటా మాత్రమే, క్షేత్రస్థాయికి వెళ్తేనే అసలు నిజం తెలుస్తుంది (ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్). అందుకే కార్యదర్శులు 3 రోజులు, విభాగాధిపతులు 6 రోజులు, కలెక్టర్లు 8 రోజులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి" అని ఆయన స్పష్టం చేశారు. జిల్లాల మధ్య అభివృద్ధిలో ఆరోగ్యకరమైన పోటీ ఉండాలని, ఒక జిల్లాలో అమలు చేసిన ఉత్తమ పద్ధతులను మిగతా జిల్లాల్లోనూ అమలు చేయాలని, ఆయా కలెక్టర్లను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తామని ప్రకటించారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో, పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యమని గుర్తుచేశారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# వేర్వేరు కేసుల్లో ముగ్గురు అరెస్ట్

## 50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం.



**కాకినాడ( సిటిజన్ టైమ్స్).మే 7**

జిల్లాలో వరుస చైన్‌స్నాచింగ్‌లు, ఇంటి దొంగతనాలు, మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కాకినాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 లక్షల 16 వేల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి గురువారం జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్ విలేకరులకు వివరాలను తన కార్యాలయంలో వెల్లడించారు. కాకినాడ-2 టౌన్, సర్పవరం, పిఠాపురం, ఇంద్రపాలెం, కోరింగ పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు కోనసీమ జిల్లా దాక్షారామంలో నమోదైన 12 కేసులను పోలీసులు ఛేదించగా వీటిలో ఏడు చైన్‌స్నాచింగ్‌లు, రెండు ఇంటి దొంగతనాలు, ఒక ఏటీఎం కార్డు మోసం, రెండు మోటార్‌సైకిల్ చోరీ కేసులు ఉన్నాయన్నారు. చైన్ స్నాచింగ్ కేసుల్లో అరెస్టైన పల్లా సురేంద్రకుమార్, రంగాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి 320 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, 40 వేల



నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 46లక్షల 50 వేల రూపాయలని ఎస్పీ చెప్పారు. మరో నిందితుడు రచ్చ నాగ సతీష్‌కుమార్ అలియాస్ బబ్లు వద్ద నుంచి 430 గ్రాముల వెండి, మూడు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 3 లక్షల 66 వేల వరకు ఉంటుందని చెప్పారు. నిందితులు ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఏటీఎంల వద్ద వృద్ధులకు సహాయం చేస్తున్నట్లు నటించి కార్డులు మార్చి నగదు దోచుకునేవారని పేర్కొన్నారు. తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం, బయట పార్క్ చేసిన మోటార్‌సైకిళ్లను దొంగిలించడం వీరి నేర పద్ధతిగా వెల్లడైందన్నారు. బంగారు గొలుసు దొంగతనాల ముద్దాయిలను బుధవారం సామర్లకోట రోడ్లోను, మోటార్ సైకిల్ దొంగతనం కేసులో ముద్దాయిని వలసపాకలలో అరెస్ట్ చేసినట్టు చెప్పారు. విహారయాత్రలకు ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు తెలియజేస్తే తాము వచ్చి ఎల్ హెచ్ఎంఎస్ అనే పరికరాన్ని అమర్చుతామని దానిని వినియోగికోవాలని ఎస్పీ సూచించారు. ఈ కేసులను ఛేదించిన ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్బి డిఎస్పి కెవివి సత్యనారాయణ, సీసీఎస్ సీఐ వి కృష్ణ, కాకినాడ టూ టౌన్స్ ఆర్ అప్పలనాయుడు, సామర్లకోట క్రైమ్ సీఐ ఆర్ అంకబాబు, కాకినాడ-2 టౌన్ ఎస్ఐ బుజ్జిబాబు, సర్పవరం ఎస్ఐ ఎం ఏసుబాబు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.

## మొదటి పేజీ తరువాయి

# తిరుమల లడ్డు వ్యవహారంపై ఏపీ సర్కారు కీలక నిర్ణయం

**తిరుమల, సిటిజన్ టైమ్స్**

తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతతో పాటు ఇతర వివాదస్పద అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఏక సభ్య కమిటీ నివేదికను లోతుగా అధ్యయనం చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన హై లెవెల్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, డీజీపీ, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. నివేదికలోని సాంకేతిక, పరిపాలనాపరమైన, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా సమీక్షించి, బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ మార్గదర్శకాలను రూపొందించనుంది. ఈ అత్యున్నత స్థాయి కమిటీ తన నివేదికను వారంలోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాలు అందాయి. లడ్డూ తయారీలో నిబంధనల ఉల్లంఘన ఎక్కడ జరిగింది, అందుకు గల కారణాలను విశ్లేషించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం.

# పిఠాపురం టీడీపీ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి వర్మ తొలగింపు...

హైకమాండ్ దృష్టిసారించింది.. నియోజకవర్గంలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలను తీవ్రంగా పరిగణించిన టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ఎస్‌వీఎస్‌ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ పార్టీ హైకమాండ్ ఆదేశాలు జారీ చేసింది. వర్మను తప్పించడంతో పాటు, నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా ముందుకు నడిపేందుకు వీలైనంత త్వరగా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు. ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి పార్టీ స్థాయిలో ఇప్పటికే కసరత్తు మొదలైంది. కొత్త కమిటీ ద్వారా నియోజకవర్గంలో పార్టీ శ్రేణుల్లో సమన్వయం సాధించి, పార్టీని మరింత బలోపేతం చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. త్వరలోనే ఈ కమిటీ సభ్యులను ప్రకటించనున్నారు. గత కొంతకాలంగా పిఠాపురంలో ఎస్వీఎస్ఎన్ వర్మ వర్గానికి, జనసేన క్యాడర్ కు మధ్య తరచుగా వివాదాలు ఏర్పడుతున్నాయి. ఇది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో, కూటమి పొత్తు ధర్మం దెబ్బతినకుండా టీడీపీ అధిష్ఠానం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది.

# విహార నౌకలో హంటర్ కలకలం.. బెంబేలెత్తిస్తున్న వైరస్

55 మంది సిబ్బంది ఉన్నారు. 22 దేశాలకు చెందిన వీరంతా గత నెల 1న దక్షిణ అమెరికాలోని అర్జెంటీనా నుంచి బయల్దేరారు. హంటర్ వైరస్ సోకడంతో ఇప్పటికే ముగ్గురు మరణించారు. మరి కొంత మందికి ఈ వైరస్ సోకిందని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం అట్లాంటిక్ మహా సముద్రంలో ప్రయాణిస్తున్న ఈ నౌకలోని వారంతా క్వారంటైన్‌లో ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా రంగంలోకి దిగింది. నౌకలోనే పరీక్షలు నిర్వహిస్తోంది. హంటర్ వైరస్ సోకిందన్న అనుమానంతో బుధవారం ముగ్గురు రోగులను అధికారులు నెదర్లాండ్స్‌కు తరలించారు. ఈ వైరస్‌కు వ్యాక్సిన్లు, మందులు లేవు. త్వరగా గుర్తించకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం ఎక్కువ.

# చైనా రక్షణశాఖ మాజీ మంత్రులకు మరణశిక్ష

రెండేళ్లపాటు నిలిపివేసినట్లు అధికారిక మీడియా వెల్లడించింది. ఫెంగే.. 2018-23 మధ్యకాలంలో చైనా రక్షణశాఖ మంత్రిగా పనిచేశారు. అంతకుముందు పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన అత్యంత కీలకమైన 'రాకెట్ ఫోర్స్'కు అధిపతిగా ఉన్నారు. ఆయన అనంతరం రక్షణశాఖ మంత్రిగా లీ షాంగ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవికి ఆయన్ను స్వయంగా జిన్‌పింగే ఎంపిక చేశారు. కానీ, ఏడాది తిరగకముందే తొలగించారు. అనంతరం షాంగ్ కొన్ని నెలలపాటు కనిపించకుండా పోయారు. 2024లోనే అధికార కమ్యూనిస్టు పార్టీ నుంచి ఈ ఇద్దరినీ బహిష్కరించారు.

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాశాఖకు సంబంధించి ఒక సమగ్రమైన కేపీఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్) డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యార్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

# ప్రజల భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీసుల ప్రత్యేక డ్రైవ్



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే 07**

అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్లు, జాతీయ రహదారులు, పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలలో అనుమానాస్పద వాహనాలు, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులను పరిశీలిస్తూ అక్రమ రవాణా, మద్యం, గంజాయి మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# విశాఖలో నార్కోటిక్ డాగ్ సహాయంతో 3.5 కిలోల గంజాయి పట్టివేత



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే 07**

విశాఖ నగర పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మర్రిపాలెం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో నార్కోటిక్ డాగ్ సహాయంతో 3.5 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డా. శంఖబ్రత బాగ్చి,కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు, ఆర్ఐ (సెక్యూరిటీ వింగ్) ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందాలు నగరంలోని పలు ప్రాంతాల్లో నిత్య తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో నార్కోటిక్ డాగ్ "విశ్వ" అనుమానాస్పద బ్యాగ్‌ను గుర్తించగా, తనిఖీ చేయగా అందులో 3.5 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుడు పరారీలో ఉండటంతో స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి విచారణ కోసం ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గంజాయి గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన నార్కోటిక్ డాగ్ "విశ్వ", డాగ్ హ్యాండ్లర్ మరియు పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

# పీఎం కేర్స్ పిల్లలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :07**

పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద లబ్ధి పొందుతున్న పిల్లలకు ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం విశాఖపట్నంలోని సంక్షేమ భవన్‌లో నిర్వహించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకింగ్ సేవలు, పొదుపు అలవాట్లు, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాల నివారణ తదితర అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పీఎం కేర్స్ పథకం ద్వారా లభించే ఆర్థిక సహాయాన్ని భవిష్యత్తు అవసరాలకు సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి కె.వి. రామలక్ష్మి పిల్లలతో మాట్లాడి, విద్య మరియు ఆర్థిక పరమైన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ ప్రతినిధులు బ్యాంక్ ఖాతాల నిర్వహణ, డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాల నివారణపై ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులు, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు. పీఎం కేర్స్ లబ్ధిదారులైన పిల్లలు చురుకుగా పాల్గొని పలు అంశాలపై అవగాహన పొందారు.



# చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధే ధ్యేయం..

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తామని తెలిపారు... తోరం రాజా

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 7**

ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈరోజు హోటల్ గ్రాండ్ పార్క్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సు లో ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపిమా కు ఎన్నికైన కార్యవర్గ కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ సినీ ప్రోడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ కు ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు తోరం రాజా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న చలనచిత్ర పరిశ్రమ సభ్యులు అందరికీ జీవనోపాధి కల్పించాలని అందుకొరకు రాష్ట్రంలో ఫిల్మ్ స్టూడియోలు, రికార్డింగ్ రీ రికార్డింగ్ స్టూడియోలు, డబ్బింగ్ స్టూడియోలు నిర్మాణం చేపట్టాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన యం.యల్.సి. బోమ్మి ఇజ్రాయెల్ మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో అనేక అద్భుతమైన లోకేషన్స్ ఉన్నాయని,ఈ ప్రాంతంలో ఫిల్మ్ స్టూడియో ఉంటే రెగ్యులర్ గా షూటింగ్స్ జరుగుతాయని, చలనచిత్ర పరిశ్రమ సభ్యులు అందరికీ జీవనోపాధి కలుగుతుందని తెలిపారు. మరో ముఖ్య అతిథి గుత్తుల సాయి మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అందమైన లోకేషన్స్ ఉన్నాయని, చిత్రం నిర్మాణానికి ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుందని, చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన అహుడా చైర్మన్ అల్లాడ సోంబాబు మాట్లాడుతూ... అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగలక్ష్మి మాట్లాడుతూ చలనచిత్ర పరిశ్రమ కార్మికులు అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశం




పెట్టిందని, అందరూ ఈశ్రమ్ కార్డులు తీసుకోవాలని, చలనచిత్ర పరిశ్రమ కార్మికులు అందరికీ కార్మిక హశాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపిమా అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు మోకా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ... అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చలనచిత్ర పరిశ్రమ సభ్యులుకు అండగా ఉంటామని ఎలాంటి సమస్యలు ఉన్నా తమకు తెలపాలని తెలిపారు. "ఏపిమా" అధ్యక్షులు పిల్లా లక్ష్మి ప్రసాద్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ "ఏపిమా" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న నటీనటులు అందరికీ సంక్షేమం, అభివృద్ధి అందించడానికి ఏర్పాటు కాబడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ నటినటులు వినియోగించుకోవాలని కోరారు.

**ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపిమా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు:**

అధ్యక్షులు: పిల్లా లక్ష్మి ప్రసాద్
ఉపాధ్యక్షులు: ఆవుల వీర శేఖర్ యాదవ్
ప్రధాన కార్యదర్శి: జానపాటి విశ్వేశ్వరరావు
కోశాధికారి : గుర్రం వెంకటేశ్వర్లు
కార్యదర్శి : రాపేటి అప్పారావు
కార్యదర్శి : తెనాలి శకుంతల

కార్యవర్గ కమిటీ సభ్యులు శ్రీమతి చుండూరు వెంకట సూర్య కుమారి, మండలి మాధవి, బోజ్జా గురవయ్య, చందా బ్రహ్మయ్య, షేక్ చాన్ భాషా, శాంబోలు హరినాథ్, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ సినీ ప్రోడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

అధ్యక్షులు : బండ్రెడ్డి శశికుమార్
ఉపాధ్యక్షులు : చితిరాల నాగ మధు
ప్రధాన కార్యదర్శి : కొడదల శివ ప్రసాద్ రెడ్డి
కోశాధికారి : ఉబా ప్రసాద్ ప్రమాణం చేసారు. ఈ కార్యక్రమంలో గంధం పల్లంరాజు, వాసంశెట్టి రాధాకృష్ణ , యాళ్ల దోర బాబు, దొమ్మేటి రమేష్,నల్లా చిట్టిబాబు, మండెల బాబి, చొల్లంగి అప్పాజి, దొమ్మేటి హరిష్, గనిశెట్టి అరవింద్, వాసంశెట్టి శ్రీనివాస్, కొమ్ముల సురేష్ తదితరులు ాల్గొన్నారు.

# ప్రతి గురువారం గ్రామ బాటలో అధికారులు ప్రజా సమస్యల పరిష్కారానికి 'వన్ మంత్ వన్ విలేజ్.. ఫోర్ విజిట్స్' కార్యక్రమం ఎంపీడీఓ రాజు

## " అర్జీలు స్వీకరించి తక్షణ పరిష్కారమే లక్ష్యం – గ్రామ ప్రజలకు అధికారుల భరోసా"

**ఆలమూరు సిటిజన్ టైమ్స్ మే 7**

బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలంలో ప్రజలకు మరింత చేరువగా పాలన అందించేందుకు "వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ. రాజు తెలిపారు. మండల తహసిల్దార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కారం చూపించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ. రాజు మాట్లాడుతూ, ప్రతి గురువారం ఒక గ్రామాన్ని నాలుగు సార్లు సందర్శిస్తూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు.అనంతరం తహసిల్దార్ ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పెన్షన్లు, రేషన్, ఆదాయ ధృవపత్రాలు, భూ సంబంధిత సమస్యలు, సామాజిక భద్రత అంశాలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి



తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని తహసిల్దార్ సూచించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్ఎస్సి,ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభకు సత్కారం...



**మలికిపురం సిటిజన్ టైమ్స్, మే 7**

మలికిపురం, సఖినేటిపల్లి రాజోలు మండలలో ని 10వ తరగతి, ఇంటర్మీడియట్ 2026 పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అశ్వా విద్యార్థి సంఘం అధ్యక్షులు పోలిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో శాసనసభ్యులు దేవ వరప్రసాద్ చేతులు మీదుగా విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్, విద్యార్థులు తల్లిదండ్రులు, పాల్గొన్నారు. ఎస్ ఎస్ సి, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సుమారు 200 మంది విద్యార్థులకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా చిరు సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# బి కొత్తకోటలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఆంక్షలు

పెద్ద తిప్ప సముద్రం బి



**కొత్తకోట సిటిజన్ టైమ్స్ మే 7**

అన్నమయ్య మదనపల్లి జిల్లా బి.కొత్తకోట ట్రాఫిక్ సమస్య నివారణ కొరకు అధికారులు చర్యలు చేపట్టారు వాహనాలు రాకపోకలను సీఐ గోపాల్ రెడ్డి వివరించారు మదనపల్లి నుంచి వచ్చే వాహనాలు కింద బస్టాండ్ నుండి బైపాస్ రోడ్డు మీదుగా జ్యోతి బస్టాండ్ మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు వెళ్లాలి బెంగళూరు నుంచి వచ్చే వాహనాలు జ్యోతి బస్టాండ్ హాస్పిటల్ మీదుగా కదిరి నుంచి వచ్చే వాహనాలు బైపాస్ రంగసముద్రం రోడ్డు మీదుగా జ్యోతి బస్టాండ్ ప్రభుత్వాసుపత్రి వరకు చేరాలి అలాగే దుకాణదారులు షాపులు ముందర టూ వీలర్లు ఎక్కడపడితే అక్కడ పెట్టనివ్వకండి అలా పెట్టిన యెడల షాపుల యజమానులకు బైకుల యజమానులకు చలానాలు రాయబడతాయి ప్రజలు ఈ విషయాలను గమనించి ప్రజల కొరకు జరుగుతున్న ఈ కార్యక్రమం అందరూ గమనించి ప్రభుత్వ అధికారులకు సహకరించాలని కోరుచున్నాము ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు ప్రజలు విచ్చేసి సిఐ వేణుగోపాల్ రెడ్డి చెప్పిన మాటలను ఆలకించారు.

# పోక్సో చట్టం అందరికీ సమానమేనా...?




దేశంలో బాలలపై జరుగుతున్న లైంగిక నేరాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2012లో అమల్లోకి తీసుకొచ్చిన లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో) బాలికలకే కాకుండా బాలురకు కూడా సమాన రక్షణ కల్పిస్తోందని ఇటీవల కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. నేరం చేసిన వ్యక్తి పురుషుడా? మహిళా? అన్నది ముఖ్యం కాదని, బాలుడిపై లేదా బాలికపై లైంగిక నేరం జరిగిందా లేదా అనేదే ముఖ్యమని న్యాయస్థానం పేర్కొంది. మహిళలు కూడా లైంగిక నేరాలకు పాల్పడే అవకాశం ఉందని, అలాంటి సందర్భాల్లో వారిపై కూడా పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవచ్చని హైకోర్టు వెల్లడించింది. కర్ణాటకలో 48 ఏళ్ల ఉపాధ్యాయురాలు తన ఇంటి పక్కన నివసించే 13 ఏళ్ల బాలుడిని లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదవడంతో, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎం. నాగప్రసన్న కేసును కొట్టివేయడానికి నిరాకరించారు. పోక్సో చట్టం లింగ వివక్ష చూపదని, ఈ చట్టంలోని "పర్సన్" అనే పదం కేవలం పురుషులను మాత్రమే సూచించదని స్పష్టం చేశారు. 2019లో చేసిన సవరణల తర్వాత పోక్సో చట్టం పూర్తిగా లింగతటస్థంగా మారిందని కోర్టు పేర్కొంది. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలితే పురుషులైనా, మహిళలైనా శిక్షార్హులేనని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

సాధారణంగా సమాజంలో బాలికలే ఎక్కువగా లైంగిక నేరాలకు గురవుతారని భావన ఉన్నప్పటికీ, బాలురు కూడా ఇలాంటి ఘటనలకు బలవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. అయితే అవమానం, భయం, సమాజపు విమర్శల కారణంగా చాలా మంది బాలురు బయటకు చెప్పేందుకు వెనుకాడుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పోక్సో చట్టం ప్రతి బాలుడికి, బాలికకు సమాన రక్షణ కల్పించేలా రూపొందించబడిందని న్యాయవాదులు పేర్కొంటున్నారు.

**కేసులో ఉదాహరణ 1:**

ఇటీవల హైదరాబాద్ మహానగరంలో నమోదైన ఒక కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 25 ఏళ్ల యువతి ఒక మైనర్ బాలుడిని లైంగికంగా వేధించినట్లు నిర్ధారణ కావడంతో బాలమిత్ర కోర్టు ఆమెకు 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ తీర్పుతో మహిళలు చేసిన లైంగిక నేరాల విషయంలో కూడా చట్టం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో స్పష్టమైంది. బాలురపై జరిగే లైంగిక దాడులను కూడా న్యాయవ్యవస్థ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని ఈ కేసు వెల్లడించింది.

**కేసులో ఉదాహరణ 2:**

అలాగే ఓ మైనర్ బాలికపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో గద్వాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు నిందితుడికి 25 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.40 వేల జరిమానా విధిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బాలలపై జరిగే నేరాల విషయంలో కోర్టులు ఎలాంటి రాజీకి తావులేకుండా కఠిన శిక్షలు విధిస్తున్నాయని ఈ ఘటనలు సూచిస్తున్నాయి. పోక్సో చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరూ "బాలలు"గా పరిగణించబడతారు. లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, అసభ్య ప్రవర్తన, ఆన్‌లైన్ వేధింపులు, అత్యాచారం వంటి నేరాలకు ఈ చట్టం కింద కఠిన శిక్షలు అమలవుతాయి. నేర తీవ్రతను బట్టి మూడు సంవత్సరాల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు విధించే అవకాశం ఉంది. కొన్ని అత్యంత దారుణ ఘటనల్లో మరణదండన నిబంధన కూడా అమల్లో ఉంది. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలకు "గుడ్ టచ్ బ్యాడ్ టచ్" పై అవగాహన కల్పించడం, వారి ప్రవర్తనలో మార్పులను గమనించడం, భయపడకుండా సమస్యలు చెప్పే వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని చెబుతున్నారు. బాలలపై జరిగే లైంగిక నేరాలను దాచిపెట్టకుండా వెంటనే ఫిర్యాదు చేస్తేనే ఇలాంటి ఘటనలను అరికట్టడం సాధ్యమవుతుందని పోలీసులు సూచిస్తున్నారు.

జె. కనక దుర్గా లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచార్జి.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించాలి

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్







**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :07**

నగర పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను మరింత సమర్థవంతంగా చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పారిశుద్ధ్య సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. నగరంలో అదనపు పారిశుద్ధ్య కార్మికులను నియమించడం వల్ల పరిస్థితి గతంతో పోలిస్తే మెరుగుపడిందని కమిషనర్ పేర్కొన్నారు. అయితే ఇంకా మెరుగుదలకు అవకాశం ఉన్నందున రానున్న 30 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణతో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.జోనల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో నిత్య పర్యవేక్షణ నిర్వహించి పారిశుద్ధ్య లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. నగరంలో వ్యర్థాల సేకరణ నిరంతరం జరుగుతున్నప్పటికీ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లపై, దుకాణాల ముందు చెత్త వేస్తున్న వారిపై శానిటరీ ఇన్స్పెక్టర్లు అపరాధ రుసుములు విధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణ వాహనాల సమయాలను ప్రజలకు, దుకాణదారులకు ముందుగానే తెలియజేయాలని, నిర్ణీత సమయాల్లోనే చెత్తను వాహనాలకు అందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అయినప్పటికీ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాత్రి పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా సహాయ వైద్యాధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ సూచించారు. అలాగే పిన్ పాయింట్ల వారీగా పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ వాహనాల పనితీరును సమన్వయం చేస్తూ నిర్ణీత సమయాల్లో విధులు నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలువలు, గెడ్డల్లో పూడికతీత పనులు నిరంతరంగా చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో కాలువలు పొంగిపొర్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధులకు గైర్హాజరయ్యే పారిశుద్ధ్య కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించి కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకురావాలని జోనల్ కమిషనర్లకు సూచించారు. అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్ మాట్లాడుతూ వ్యర్థాల సేకరణ, తరలింపు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్లకు సూచించారు. జోనల్ కమిషనర్లు మాట్లాడుతూ అదనపు పారిశుద్ధ్య సిబ్బంది నియామకంతో పనితీరు మెరుగుపడిందని, నగర పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తామని కమిషనర్‌కు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో రాత్రి పారిశుద్ధ్య సూపర్వైజర్లు, శానిటేషన్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రమాద భీమా చెక్కు అందజేత



**గోపాలపట్నం, సిటిజన్ టైమ్స్, మే :07**

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గనబాబు పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద భీమా చెక్కును ఆయన గురువారం అందజేశారు. 52వ వార్డు పరిధికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త సూర్యారామ కృష్ణ కాత్రేనికోన (సభ్యత్వ నెం: 15359262) ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన కుటుంబానికి భరోసా కల్పించేందుకు ఎమ్మెల్యే గణబాబు నేరుగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని భార్య నందిని కాత్రేనికోనకు రూ.5 లక్షల ప్రమాద భీమా చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ భీమా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రమాదవశాత్తు కార్యకర్త మరణించిన సందర్భాల్లో వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా సహాయం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి కార్యకర్తను టీడీపీ గౌరవిస్తుందని, కష్టకాలంలో వారి కుటుంబాలకు అండగా నిలబడటం పార్టీ బాధ్యతగా భావిస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వై. తిరుమలరావు, వెంకుమహంతి చంద్రశేఖర్‌తో పాటు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న విశాఖ జిల్లా అధికారులు






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :07**

రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు నేతృత్వంలో గురువారం నిర్వహించిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు సమావేశంలో విశాఖపట్నం జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో సమావేశానికి హాజరైన అధికారులు, ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను నమోదు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు, పరిపాలనలో పారదర్శకత, గ్రామస్థాయి సమస్యల పరిష్కారం, రెవెన్యూ వ్యవహారాలు, సంక్షేమ కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చ జరిగింది. అలాగే ప్రజలకు వేగవంతమైన సేవలందించడం, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో సమన్వయం పెంపు, గ్రామస్థాయిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించే చర్యలపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేసినట్లు అధికారులు తెలిపారు.

## పరిపాలన పారదర్శకత, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష

### పాల్గొన్న కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,మే :07**

రాష్ట్ర సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నిర్వహించిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు సమావేశంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలు, ప్రజా సేవల మెరుగుదల, పరిపాలనలో పారదర్శకత, గ్రామస్థాయి సమస్యల పరిష్కారం, రెవెన్యూ మరియు సంక్షేమ కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొని వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు, లక్ష్యాల సాధనపై చర్చించారు.



## జడ్పీ కార్యాలయంలో అల్లూరి స్మారక కార్యక్రమం నిర్వహణ



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే :07**

మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. నారాయణమూర్తితో పాటు ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు పాల్గొన్నారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ పి. నారాయణమూర్తి మాట్లాడుతూ, అల్లూరి చేసిన స్వాతంత్ర్య పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ధైర్యసాహసాలు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.బి. సత్తిబాబు మాట్లాడుతూ, గిరిజనుల హక్కులు, దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి చేసిన త్యాగం మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొని అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు అర్పించారు.

## క్రీడల్లోనూ ఏఎంసీకి తిరుగులేదని మరోసారి నిరూపణ




**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మే:07**

వైద్య విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ తమకు సాటిలేరని మరోసారి నిరూపించింది ఆంధ్ర మెడికల్ కాలేజ్ (ఏఎంసీ). డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో నిర్వహించిన ఏపీ స్టేట్ మెడికల్ ఌ డెంటల్ ఇంటర్-కాలేజియేట్ స్పోర్ట్స్ మీట్‌లో ఆంధ్ర మెడికల్ కాలేజ్ పురుషుల, మహిళల అథ్లెటిక్స్ జట్లు అద్భుత ప్రతిభ కనబరిచి వరుసగా 16వ సారి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని చరిత్ర సృష్టించాయి. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఏఎంసీ ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి జట్టు సభ్యులను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్వంత నిధుల నుంచి రూ.35 వేల విలువైన ట్రాక్ సూట్లను కొనుగోలు చేసి, 19 మంది అథ్లెటిక్స్ జట్టు సభ్యులకు అందజేశారు. విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, పట్టుదల మరియు జట్టు స్ఫూర్తి ఈ విజయానికి కారణమని ఆమె ప్రశంసించారు. క్రీడల్లో సాధించిన ఈ ఘనత ఆంధ్ర మెడికల్ కాలేజ్‌కు మరింత ప్రతిష్టను తీసుకువచ్చిందని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇదే జోష్‌తో మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

# అటవీ గణాంకాల్లో వ్యత్యాసాలపై ప్రభుత్వ దృష్టి

## కలెక్టర్ విజయ కృష్ణన్

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, మే :07**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో అటవీ సంపద పాత్ర, అటవీ ఉత్పత్తుల డేటా సేకరణలో ఎదురవుతున్న సవాళ్లపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో కీలక చర్చ జరిగింది. గురువారం సచివాలయం ఐదో బ్లాకులోని కాన్ఫరెన్స్ హాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) సేకరిస్తున్న వివరాలే అధికారిక రికార్డుల్లో నమోదవుతున్నాయని, అయితే గిరిజనులు సేకరించే చిన్న తరహా అటవీ ఉత్పత్తుల (ఎంఎఫ్‌పీ) వివరాలు పూర్తిస్థాయిలో నమోదు కావడం లేదని ఆమె తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో సాగు చేసే కలప వివరాలతో పాటు ప్రైవేటు మరియు ఇతర మార్గాల్లో జరుగుతున్న కలప సాగు సమాచారాన్ని కూడా డేటాలో చేర్చితే జిల్లాల అభివృద్ధి సూచీలు (కేపీఐలు) మరింత సమగ్రంగా ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. అలాగే గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో విక్రయమవుతున్న అటవీ ఉత్పత్తుల కారణంగా గణాంకాల్లో వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అటవీ సంపదను "బంగారు గని"గా అభివర్ణిస్తూ, రాష్ట్రంలో అపారమైన అటవీ భూములు మరియు సహజ వనరులు ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో, ఖచ్చితమైన గణాంకాల సేకరణలో ఇంకా వెనుకబడి ఉన్నామని అభిప్రాయపడ్డారు. అటవీ భూములను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తే రాష్ట్ర ఆదాయం పెరగడంతో పాటు జిల్లాల అభివృద్ధికి కూడా ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.



# స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరికి ఘనంగా నివాళులర్పించిన అవంతి



**తగరపువలస, సిటిజన్ టైమ్స్, మే :07**

మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) ఆయనకు ఘన నివాళులర్పించారు. తగరపువలసలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అల్లూరి పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి గెరిల్లా పోరాటంతో ఆంగ్లేయులను గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కేవలం 27 ఏళ్ల చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత ప్రతి తెలుగువాడికి గర్వకారణమని పేర్కొన్నారు. అల్లూరి ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శమని, ఆయన చరిత్రను భావితరాలకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజనులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడమే అల్లూరికి ఇచ్చే నిజమైన నివాళి అని ముత్తంశెట్టి పేర్కొన్నారు. మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అల్లూరి ఆశయాలను కొనసాగిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డా. ఎ. చంద్రశేఖర్, విశ్వప్రసాద్, ప్రిన్సిపాల్ డా. మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ డా. షరీఫ్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతికి ఘనంగా నివాళులర్పించిన జిల్లా ఎస్పీ



**కాకినాడ (సిటిజన్ టైమ్స్) మే 7**

జిల్లా పోలీసు కార్యాలయం లో స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఈరోజు కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి బిందుమాధవ్, ముఖ్య అతిథిగా పాల్గొని, అల్లూరి సీతారామరాజు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు మన ప్రాంతం వారు కావడం మనందరి అదృష్టమని, మన్యం ప్రజల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన గొప్ప యోధుడు అల్లూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఐపీఎస్, ఎస్బి డీఎస్పీ కెవివి సత్యనారాయణ, సిఐలు, ఎస్ఐలు మరియు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.

# వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ పూజలు..





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మే 7**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామ పంచాయతీ లో నూతన ఆలయ పునర్ ప్రతిష్ట ను వైభవంగా నిర్వహించినారు. అయులూరి సూర్య కుమార్ ఆధ్వర్యంలో గణపతి ప్రార్ధన, సంకల్పం, భూత బలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యావాచన, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండ దీప ప్రజ్వలనం, అస్త్ర రాజార్చన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టపన, మూల మంత్రం, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పాలు, జరిపించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, బ్రాహ్మణులు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మాజీగూడెంలో వేసవి శిక్షణ తరగతులు



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మే: 07**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామంలో ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులతో నీతి కథలు చదివించినట్లు గ్రంథాలయ అధికారిని రమణ తెలిపారు. నీతి కథలలో ఒకటి దశావతారంలోని కృష్ణ అవతారం విశిష్టతను పిల్లలకు వివరించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ శ్రీను ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ, తెలుగు దస్తూరిపై అభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ శాఖకు సంబంధించిన సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలు అభివృద్ధి పనులపై అంచనాలను రూపొందించాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ వైకోమ్ నిధియా దేవి

**అమలాపురం సిటిజన్ టైమ్స్, మే 7**



గోదావరి పుష్కరాలు 20 27 ను పురస్కరించుకొని తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా రక్షణ, భద్రత ధ్యేయంగా అభివృద్ధి పనులకు అంచనాలను ప్రతిపాదించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నిదియాదేవి అధికారులు ఆదేశించారు .గురువారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో వివిధ శాఖల రూపొందించిన ప్రతిపాదనలపై ఆమె సమీక్షించారు. 2027లో అత్యంత వైభవంగా జరగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం పక్కా ప్రణాళి కతో సివిల్ పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు నిధియాదేవి తెలిపారు .ఘాట్ల అభివృద్ధి మరియు సివిల్ పనులు పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నదీ తీర ప్రాంతాల్లోని ఘాట్లను ఆధునీకరించడమే ప్రాధాన్యతగా తీసుకు న్నట్లు తెలిపారు .?పాత ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడం. భక్తుల భద్రత కోసం పటిష్ట మైన రక్షణ గోడల నిర్మా ణం.?ప్రమాదాలు జరగ కుండా నదీ గర్భంలో తగిన జాగ్రత్తలతో మెట్ల నిర్మాణం చేపట్టేలా ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందించారన్నారు. జల వనరుల శాఖ 185 పనులు, ఆర్ అండ్ బి 12 పనులు ఆర్డబ్ల్యూఎస్ 175 దేవాదాయ ధర్మాదాయ శాఖ 261 పనులు, పంచాయతీరాజ్ ఇంజనీ రింగ్ విభాగం 167 పనులు మేజర్ గా ప్రతిపా దించా యన్నారు అప్రోచ్ రోడ్ల విస్తరణ,?పుష్కర ఘాట్లకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అప్రోచ్ రోడ్ల అనుసంధాన రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధపరచాలన్నారు. ప్రధాన రహదా రుల నుండి ఘాట్ల వరకు ఉన్న మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చడం, రోడ్ల వెడల్పు పెంచడం ద్వారా వాహనాల రాకపోకలను క్రమబద్ధీ కరించడం వంటి పనులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు మౌలిక వసతుల కల్పనవచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కనీస వసతులపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ప్రతి ఘాట్ వద్ద తాగునీటి కేంద్రాలు, మొబైల్ టాయి లెట్లు, నిరంతర పారిశుధ్య నిర్వహణ వ్యవస్థలు ఉం డాలన్నారు.ఘాట్ల వద్ద, పార్కింగ్ స్థలాల్లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు. తాత్కాలిక షెడ్లు, వైద్య శిబిరాలు, మహిళల కోసం ప్రత్యేక దుస్తులు మార్చుకునే గదుల ఏర్పాటు?ఏర్పాటు చేయాలన్నారు.పుష్కరాల ప్రతిపాదనలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో నాణ్యతతో కూడిన పనులు జరిగేలా అంచనాలు పక్కాగా ఉండాలన్నారు. నిధుల దుర్విని యోగం కాకుండా, దీర్ఘకా లిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సివిల్ పనుల డిజైన్లను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ నిధియాదేవి అధికా రులను ఆదేశించారు. రాబోయే కొద్ది రోజుల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి, తుది నివే దికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వి సుబ్బారావు దేవదయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి సత్యనారా యణ, పి ఆర్ ఎస్ ఈ పి రామకృష్ణారెడ్డి, ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ ఏవీఎస్ రాజన్, ఆర్ అండ్ బి ఎస్ ఈ: బి రాము, సిపిఓ ఎం మురళీకృష్ణ జల వనరుల శాఖ హెడ్ వర్క్స్ ఈ ఈ వెంకటేశ్వరరావు తదిత రులు పాల్గొన్నారు.

# వానపల్లి ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..

## బాధితులకు ధైర్యం చెప్పి, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించిన ఎమ్మెల్యే...



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ మే 7**

వానపల్లి శివారు రామ్మోహన్ పేటలో బుధవారం మధ్యాహ్నం ఒక వివాహ వేడుకలో విందు సందర్భంగా ఫుడ్ పాయిజన్ కు గురైన 35మందికి పైగా బాధితులను గురువారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడి వారికి భరోసా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహ వేడుకలో విందు కారణంగా ఫుడ్ పాయిజన్ జరిగినట్లు తెలుస్తుందన్నారు. బాధితులకు సరైన చికిత్స అందేలా వైద్యులు తగిన చర్యలు తీసుకున్నారన్నారు. వానపల్లి పీహెచ్సీలో మొదట బాధితులను చేర్చినా, అక్కడ నుంచి కొత్తపేట సీహెచ్సీకి తరలించడం జరిగిందన్నారు. ఇక్కడ డాక్టర్లు అందరూ ప్రత్యేక పర్యవేక్షణలో వారందరికీ వైద్యం అందిస్తున్నారన్నారు. వారందరి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపడం జరిగిందన్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు అందరూ బాధితుల్లో ఉన్నారన్నారు.ఉదయం, రాత్రి ఒకే రకమైన భోజనం తిన్నవారికి ఎక్కువగా ఇబ్బంది కనపడుతుందన్నారు. వైద్యులు, సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని, ఎటువంటి ప్రాణ భయం లేదని వారు తెలిపారన్నారు. ఫుడ్ పాయిజన్ నుంచి తేరుకోవాల్సి ఉందని తెలిపారన్నారు. ఎవరికైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారన్నారు. గ్రామంలో ఉన్న పెద్దలు అందరూ దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పరీక్షలు వచ్చిన తర్వాత బాధితులకు దానికి తగిన చికిత్స కూడా అందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే బాధ్యతలు అందరూ కోలుకుంటారని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి

## హెచ్ఎంలకు అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ పిలుపు



**కాకినాడ (సిటిజన్ టైమ్స్) మే7**

కాకినాడ నగరంలోని నగరపాలక సంస్థ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ల పెంపుపై నగరపాలక సంస్థ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం లతో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ఎంఈఓలు సుబ్బారావు ,రవి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న నాణ్యమైన విద్య, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసి అడ్మిషన్లు పెంచాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కేటీ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన అడ్మిషన్ లక్ష్యాలను పూర్తిచేయడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని అన్నారు. కాకినాడ అర్బన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు ఫలితాల ప్రచారం, ప్రకటనలు, బ్యానర్ల ద్వారా తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలు కూడా తమ విజయాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు అర్హతలు, పోటీ పరీక్షల ద్వారా ఎంపికైనవారని, ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే నాణ్యమైన బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుబాటులో ఉందని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రతి పాఠశాల తమ విద్యార్థుల ప్రతిభ, పదో తరగతి ఫలితాలు, ప్రత్యేక సౌకర్యాలను సామాజిక మాధ్యమాలు, పత్రికల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని, ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, డిజిటల్ తరగతులు, మౌలిక వసతులు, ఉచిత విద్యా సదుపాయాలను విస్తృతంగా ప్రచారం చేస్తే అడ్మిషన్లు పెరుగుతాయని ఎం ఈ ఓ లు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మేనేజర్ శిరీష్ కుమార్, నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు వర్ధంతి

**అల్లవరం సిటిజన్ టైమ్స్ మే 7**

అమలాపురం నియోజకవర్గం లోని అల్లవరం మండలం కోడూరు పాడు గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లవరం మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్తిబాబు రాజు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, మండల సెక్రెటరీ పశ్చిమాల ఏడుకొండలు ,మండల యువత అధ్యక్షులు ముత్యాల బాబి, కూటమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కొత్తపేటలో భారీ దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**14 కేసులకు సంబంధించి కోటి రూపాయల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**ఇద్దరు అంతర జిల్లా దొంగలు**

**పొన్నాడ రవిశంకర్, పైరా చిరంజీవి అరెస్ట్**

**2025, ఆగష్టు31 జరిగిన ఇంటి చోరీ కేసును ఛేదించిన కొత్తపేట పోలీసులు**






**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 7**

బీరువా పగలగొట్టి 646.361 గ్రాముల బంగారం దుండగులు అపరహించినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మేన తెలిపారు. నిందితుల వివరాలు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా వెల్లడించారు. ప్రధాన నిందితుడు పొన్నాడ రవిశంకర్‌పై ఇప్పటి వరకూ 120 దొంగతనం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రెండవ నిందితుడిపై ఒక హత్య కేసు కూడా ఉన్నట్లు వెల్లడించారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను ఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ కు సోకాజ్ నోటీస్

**అల్లవరం సిటిజన్ టైమ్స్ మే 7**

సొమ్ములు ఇక్కడ పని అక్కడతిన మరిగిన కోడి పక్కింట్లో గుడ్డు పెట్టినట్లు ప్రభుత్వ సొమ్ము తింటూ బయట వ్యక్తులకుపనిచేసిన సంఘటన అల్లవరం లో జరిగింది.దేవగుప్తం గ్రామపంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ గెడ్డం ఏడుకొండలు కు ఏ.పి.ఓ రాజా మణి షోకాజ్ నోటీస్ అందించారు.ఆమె తెలిపిన వివరాలు ప్రకారం పంట కాలువ, డ్రైన్ పనులు ఉపాధి హామీ కూలీలు చేత చేయించమని ఆదేశాలు జారీ చేశారు.అయితే ఫిల్ట్ అసిస్టెంట్ ఉపాధి కూలీలకు డ్రైన్ పనులు లో హాజరు వేసి వరిపంట కోతలకు కూలీలను మళ్లించారని అభియోగాల పై విచారణ చెయ్యగా కోతలకు పంపటం జరిగిందని ఫీల్డ్ అసిస్టెంట్ ఒప్పుకున్నారు. , ఫీల్డ్ అసిస్టెంట్ కి సోకాజ్ నోటీసులు ఇవ్వటం జరిగిందని అన్నారు. జాబ్ కార్డ్ ఉన్న వాళ్ళు అందరూ ఉపాధి పనులు వినియోగించుకోవాలని చెప్పారు. ఎక్కడైనా ఉపాధి హామీ పథకం లో అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోవటం జరుగుతోందని ఆమె హెచ్చరించారు.

# వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

## రైతులకు పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ

## కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, తహసిల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్


**కాజులూరు సిటిజన్ టైమ్స్ మే 7**

కూటమి ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం కోలంక గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులకు కొత్త పట్టాదారు పాసుబుక్కులను వాసంశెట్టి సత్యం, మండల తహసిల్దార్ గెడ్డం రవీంద్రనాథ్ ఠాగూర్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. గత ప్రభుత్వ కాలంలో చోటుచేసుకున్న అవకతవకలు, రైతుల ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం రీ-సర్వే నిర్వహించి, అనంతరం రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుబుక్కులను రైతులకు అందజేస్తోందన్నారు. రైతుల కోసం ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేసి, ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. అలాగే 24 గంటల్లోగా రైతులకు నగదు చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మండల తహసిల్దార్



గెడ్డం రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ.. కాజులూరు మండలంలో సుమారు 1900 మంది రైతులకు పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమం కోసం గ్రామసభలు నిర్వహించి రైతుల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసి పాసుబుక్కులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురువారం కోలంక గ్రామంలో 110 మంది రైతులకు పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేశామని, ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ గ్రామసభలో డిప్యూటీ తహసిల్దార్ ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేగేశ్వరరావు, మండల జనసేన అధ్యక్షుడు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహనాయుడు, కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాల రాజు,కోలంక గ్రామ కమిటీ అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబు రాజు,మాజీ సహకార సంఘ అధ్యక్షుడు దంతులూరి వెంకట నరసింహ రాజు, మాజీ సహకార సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామచంద్ర రాజు, దూడల రామగంగారావు, దంతులూరి వంశీ గ్రామ రెవెన్యూ అధికారులు సూర్యనారాయణమూర్తి , ధరణి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే మూడో క్షేత్రంగా.. ఈ క్షేత్రం ప్రసిద్ధి



**లింగపాలెం (సిటిజన్ టైమ్స్) మే: 07**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురం గ్రామంలో ఉన్న శ్రీ భూనీల సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలోని అరుదైన విశిష్టత ఉంది.1964 లో 21 రోజులు క్రతువుతో ఇక్కడ శ్రీ రామ కృత స్థూపాన్ని, విగ్రహాలను ప్రతిష్టించారు. అలాగే 1997లో 32వ స్వధాయ జ్ఞాన యజ్ఞం నిర్వహించి యజ్ఞ స్థూపాన్ని నిర్మించారు. దేశం మొత్తం మీద శ్రీ రామ కృత, యజ్ఞ స్తూపాలు ఒకేచోట ఉన్న మూడో దేవాలయం గా ఈ క్షేత్రం ప్రసిద్ధి పొందింది.

## ఆలయ నిర్మాణ పనులను పున ప్రారంభించిన పి గన్నవరం ఎమ్మెల్యే





**అయినవిల్లి సిటిజన్ టైన్స్ మే 7**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం పరిధిలోని నేదునూరు గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణ పనులను పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ఘనంగా ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి తొలి అడుగుగా ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయ నిర్మాణ పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. భక్తి భావం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు,యువత మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణంతో గ్రామానికి మరింత ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## విశాఖ పోర్టుకు 'డబుల్ గోల్డ్' అవార్డుల ఘనత

**విశాఖపట్నం, (సిటిజన్ టైమ్స్) మే: 07**

పోర్ట్ అథారిటీ ప్రతిష్ఠాత్మక 'గ్రీన్‌టెక్ సేఫ్టీ అవార్డ్స్--2026'లో మరోసారి విశేష గుర్తింపు పొందింది. పోర్టులో అమలు చేస్తున్న హెల్త్‌కేర్ ప్రమోషన్, సేఫ్టీ డెవలప్‌మెంట్ విభాగాల్లో అత్యుత్తమ పనితీరుకు గాను రెండు గోల్డ్ అవార్డులు దక్కాయి. ఉద్యోగుల భద్రత, వాటర్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణ, కాలుష్య నియంత్రణ చర్యల్లో విశాఖ పోర్ట్ ప్రత్యేకంగా నిలిచింది. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణతో పాటు సురక్షిత పనివాతావరణం కల్పించడంలో చేపట్టిన చర్యలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. ఈ అవార్డులు పోర్టు సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని పోర్టు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోర్టు చైర్మన్ డా. ఎం. అంగముత్తు, డిప్యూటీ చైర్మన్ రేణు అరోరా సిబ్బందిని అభినందించారు.



# సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలి




**దేవరపల్లి, (సిటిజన్ టైమ్స్) మే: 07**

చీడికాడ,జి కొత్తపల్లి అడివిల ఆగ్రహరం చినగోగాడ బైలుపూడి పంచాయతీల పరిదిలో సోలార్ ప్లాంట్లు నిర్మాణం పేరుతో చేపాడుతున్న బలవంతపు భూసేకరణ తక్షణమే నిలుపుదల చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ అప్పలరాజు వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న గొర్రెల మేకలు పెంపకం దార్లు సహకార సంఘం జిల్లా చైర్మెన్ గంటా శ్రీరాం సిఐటియు మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడు తదితరులు డిమాండ్ చేసారు గురువారం సోలార్ ప్లాంట్లుకు ప్రభుత్వం చేపాడు తున్న భూ బాదిత రైతుల ముఖ్య నాయుకులతో సమావేశం నిర్వహించి అనంతరం నిర్సన కార్యక్రమం చేపాట్టారు అనంతరం వారు మాట్లాడారు సోలార్ పవర్ ప్లాంట్ పేరుతో నాలుగు పంచాయతీల పేరుతో 262 ఎకారాల భూమిని రైతులు నుండి ప్రభుత్వం బలవంతంగా లాక్కోవాలని చూస్తుందని దీన్ని రైతులు ఏకగ్రీవంగా వ్యతిరేఖించడం జరుగుతుం దన్నారు అయిప్పనటికి రెవెన్యూ తహశీల్దార్ బలవంతంగా నోటీసులు ఇవ్వడం అత్యంత దారుణ మన్నారు పట్టారు లేవని పట్టాలు ఉన్న సరె ప్రభుత్వ భూములని రైతులకు ఎహక్కులు లెవని పోలీసులను పెట్టి అయిన సరె బలవంతంగా భూములు తీసుకుంటామని రైతులను తహశీల్దార్ బెదిరింపులకు పాల్పుడు తున్నారని తెలిపారు ఇటువంటి చర్యలు రైతులను అగ్రహానికి గురి చేస్తుందని పేర్కొన్నారు జి. కొత్తపల్లి సర్వే నెంబరు,167 లో 40 ఎకరాలు అడవుల అగ్రహారం లో 55 ఎకరాలు బైలపూడి లో 60 ఎకరాలు చిన్న గోవాడ లో పూర్వకాలం నుండి రైతులు సాగు చేసుకుటున్నారని విటికి 40 సంవత్సరాలు క్రితమే ప్రభుత్వ, అదికారులు సాగదార్లుకు హక్క పత్రాలు మంజూరు చేసారని తెలిపారు ఇటీవల ఈ భూములను కేంద్ర ప్రభుత్వం నిర్ణయం లో భాగంగా ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 57.97 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ని నిర్మిం చనున్నట్లు ప్రకటించిందని అన్నారు దింతో ప్రభుత్వ భూసేకరణ చేపాట్టిందని తెలిపారు ఈభూముల్లో ఉన్న వందలాది మంది రైతు కుటుంబాలు జీడి మామిడి, పామాయిల్, నువ్వులు, వేరుశనగ వంటి పంటలు పండించుకుంటు దాని పై వచ్చిన ఆదాయంతో ఉపాధి పొందు తున్నారని తెలిపారు అటువంటి విలువైన భూములను ప్రభుత్వ, అదికారులు రైతులను బెదిరించి బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారని తెలిపారు,కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రవేటికరంలో భాగంగా సోలార్ పవర్ ప్లాంట్లను ప్రైవేటు సంస్థలకు అప్పగిం చెసారని తెలిపారు అందులో భాగంగానే చీడికాడ మండలంలో నాలుగు గ్రామాల్ని గుర్తించి సేకరణకు పూనుకుందని వెంటనే ప్రభుత్వ ఆపాలని వారు డిమాండ్ చేసారు లెదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో జాజిమొగ్గల రమేష్ గంటా మాచిరాజు మాజీ ఎంపీపీ కొల్లి అప్పలనాయుడు సిహెచ్ శ్రీను పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## జూన్ 6, 7 తేదీలలో జరగబోవు ఏడవ తెలుగు ప్రపంచ సాహిత్య మహాసభలు

"మీడియా ప్రతినిధి"గా నల్లా నరసింహమూర్తి నియామకం



**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 7**

తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తంగా ప్రతి ధ్వనింపజేయాల నే మహత్తర సంకల్పంతో "చైతన్య సారస్వత పరిషత్" సౌజన్యంతో అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జూన్ 6, 7 తేదీలు శని, ఆదివారాల లో ఏడవ తెలుగు ప్రపంచ సాహిత్య మహాసభలు రాజమహేంద్రవరం లో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ నందు నిర్వహించనున్న నేపథ్యంలో మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలనే ఆశయంతో శ్రీశ్రీ కళావేదిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షులు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత, సాహితీ వేత్త నల్లా నరసింహమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్" కళా రత్న"కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి మరియు జాతీయ ప్రణాళికా అధికారి డాక్టర్ టి.పార్థసారథి ల నుండి ఈ రోజున నియామక పత్రాలు అందుకున్నారు గతంలో సంస్థ నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల. మీడియా ప్రతినిధిగా చేసిన సేవను గుర్తించి తిరిగి తనను" మీడియా ప్రతినిధి"గా నియమించినందు కు నరసింహమూర్తి వారికి కృతజ్ఞతలు తెలియజేసారు.

# మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు...! -గంటా నూకరాజు

**భీమిలి, (సిటిజన్ టైమ్స్) మే: 07**

భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మహోజ్వల శక్తి, సాయుధ పోరాట ధీరుడు అల్లూరి సీతారామరాజు అని ఆదర్స్ హిందీ ప్రేమిమండలి గౌరవ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతిని పురస్కరించుకొని భీమిలి శాఖ ఆదర్స్ హిందీ ప్రేమిమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాస్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి గంటా నూకరాజు ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా భీమిలి బీచ్ వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం గంటా నూకరాజు మాట్లాడుతూ భారతదేశంలో ఆంగ్లేయుల పెత్తనంను సహించని ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం ప్రాణాలు అర్పించారని అన్నారు. ఈ దేశం నుండి ఆంగ్లేయులను తరిమి కొట్టాలని భావించి ఎందరో ప్రముఖులు వారివారి స్థాయినిబట్టి పోరాటం చేశారని అన్నారు. కొందరు శాంతియుత పోరాటంకి శ్రీకారం చుడితే మరికొందరు ఉద్యమం రూపంలో తిరుగుబాటు చేశారని అన్నారు. ఆకోవలోకే ఒక అల్లూరి సీతారామరాజు, ఒక భగత్ సింగ్, ఒక నేతాజీ, ఒక సర్దార్ వల్లబాయ్ పటేల్ ఇలా ఎందరో ఉన్నారని అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడిస్తూ ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. శాంతియుత పోరాటంతో కాదని సాయుధ పోరాటం ద్వారానే ఈ దేశం నుండి ఆంగ్లేయులను తరిమి కొట్టొచ్చని పూర్తి



విశ్వాశంతో నమ్మి ఎనలేని పోరాటం చేశారని అన్నారు. నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో చాలా పరిమిత వనరులతో బ్రిటిష్ సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొట్టి దేశం కోసం అతి చిన్న వయస్సులోనే 27 ఏళ్ల వయస్సులో ప్రాణాలర్పించారని గంటా నూకరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో చురకల రమణ, కాసరపు నాగరాజు, సంకురుభుక్త జోగారావు, నొల్లి రమణ, వియ్యపు పోతురాజు, నెక్కెళ్ళ వెంకటరావు, జలగడుగుల మురళి, పైడిపల్లి నర్సింగరావు, కందుల సుందర్ రావు, సుంకర లక్ష్మణరావు, మట్టా దాసు, ఏనుగుతల వెంకటరావు, శ్రీనివాసరావు మాస్టర్, వాసుపల్లి వంశీ, సూరాడ పరదేశి, ఆదర్స్ హిందీ ప్రేమిమండలి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మే 7**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ,వారి ఉత్తర్వులు మేరకు జనం అధికంగా ఉండే ప్రాంతాలు అయిన షాపింగ్ మాల్స్, బంగారు షాపులు, గోల్డ్ మార్కెట్ ప్రాంతాలలో జిల్లా డాగ్ స్క్వాడ్ సహాయంతో అమలాపురం పట్టణ పోలీసులు ప్రజల భద్రత కొరకు విస్తృతంగా ముమ్మర తనిఖీలు చేయడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా ఆయా షాపింగ్ మాల్స్ , బంగారపు షాపుల యజమానులతో రాబోవు వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అనుమానిత వస్తువులు అనుమానిత మనుషుల గురించి ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పట్టణ పోలీసు వారికి తెలియపరచవలసిందిగా కోరడమైనది. ఈ తనిఖీలలో పట్టణ సీఐ పీ వీరబాబు ఎస్ఐలు ఎన్ కిషోర్ ,కె ఎం జోషి , సిబ్బంది పాల్గొన్నారు.



# అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలి...

## ఎంపీపీ కందుల వెంకటయ్య






**పుల్లల చెరువు (సిటిజన్ టైమ్స్) మే: 07**

అధికారులు సమర్ధవంతంగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ కందుల వెంకటయ్య సూచించారు.గురువారం పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.ఎంపీడీవో మరియదాసు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. శాఖల వారీగా పనితీరు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.విద్యుత్ శాఖ ఏఈ కిషోర్‌బాబు మాట్లాడుతూ మండలంలో లోవోల్టేజ్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. పాత విద్యుత్ వైర్ల మార్పిడి దాదాపు పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో రెండో దశలో పనులు చేపట్టామని చెప్పారు. లోవోల్టేజ్ నివారణకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.50కే విద్యుత్ మీటర్లు అందిస్తున్నామని, అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.అంగన్‌వాడీ సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఆస్పత్రిలో నమోదు చేసుకుని ఐడీ పొందిన వారికి పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. బాల సంజీవని ద్వారా ప్రత్యేక పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. నిర్మాణంలో నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పూర్తి చేయించాలని కోరారు. కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వెలుగు ఏపీఎం వెంకటయ్య మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇకపై పేపర్ల అవసరం లేకుండా యాప్ ద్వారానే రుణాలు మంజూరు చేసే విధానం అమల్లోకి వచ్చిందన్నారు. సీసీలు ఆమోదం తెలిపిన వెంటనే బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని వివరించారు.విద్యాశాఖ అధికారి ఎం. వెంకటభాస్కర్ మాట్లాడుతూ '100 యాక్షన్ ప్లాన్' ద్వారా ఈసారి పదో తరగతి ఫలితాల్లో మండలం 82 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. 585 మార్కులు సాధించిన విద్యార్థిని కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించి రూ.2 వేల నగదు బహుమతి అందజేశారని చెప్పారు. మండల కేంద్రంలో త్వరలో బీసీ బాలికల వసతి సముదాయం ప్రారంభిస్తామని, 100 సీట్లు మాత్రమే ఉండటంతో త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన 41 మంది విద్యార్థులకు మురికిమళ్ల వసతి గృహంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని మండిపడ్డారు.సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 9న సాహిత్య సదస్సు

## పొన్నూరు వేంకట శ్రీనివాస్

**పెన్ పవర్ ఒంగోలు, (సిటిజన్ టైమ్స్) మే: 07**

ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర ప్రదేశ్, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ ప్రపంచ తెలుగు మహా సభలు - బాలలు -డిసెంబర్ 2026 సందర్భంగా ప్రకాశం జిల్లా లో జన్మించిన తెలుగు వెలుగులను స్మరించుకునేందుకు వేదికగా ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులు సాహిత్య సదస్సు ను 10 మే 2026, నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్, ఒంగోలు ప్రాంగణం లో ఉదయం 9గంటలకు ప్రారంభించనట్లు పరిషత్తు అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్, సమన్వయ కర్తలు డా. కే. మురళీ ధర్ రెడ్డి, కోగంటి శ్రీనివాస్, సంచాలకులు పొన్నూరు వేంకట శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సులో ప్రఖ్యాత కవులు, సాహితీ మూర్తులు పాల్గొని, ప్రకాశం జిల్లా తెలుగు వెలుగులపై ప్రసంగిస్తారని డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సులో 26 మంది సాహిత్య ప్రముఖులు వక్తలు గా పాల్గొని ప్రసంగిస్తారని పొన్నూరు తెలిపారు. కనుక జిల్లాలోని కవులు రచయితలు భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశిష్ట సాహిత్య సదస్సుని విజయవంతం చేయవలసిందిగా గజల్ శ్రీనివాస్ కోరారు.

# చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష



**గిద్దలూరు, (సిటిజన్ టైమ్స్) మే: 07**

గిద్దలూరు కోర్టు గురువారం చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు యిచ్చారు. గిద్దలూరు కు చెందిన షేక్ అస్మతుని షా వద్దా రాచర్ల మండలానికి చెందిన షేక్ చాంద్ బాషా అప్పుగా నగదు తీసుకొని చెల్లించే క్రమంలో చెల్లని చెక్కు ఇచ్చాడు. బాధితురాలు పలుమార్లు చెక్కు ఇచ్చిన వ్యక్తిని సంప్రదించింది. స్పందన లేకపోవడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. చెల్లని చెక్కు విషయంలో విచారణ జరిపిన న్యాయమూర్తి భరత్ చంద్ర నేరం రుజువు కావడంతో నిందితుడు చాంద్ భాషా కు ఏడాది జైలు శిక్ష విధించడంతో పాటు రూ.4 లక్షలు నగదు బాధితురాలికి చెల్లించాలని న్యాయమూర్తి భరత్ చంద్ర.. నిందితుడిని ఆదేశించారు.

# రాగ సింధూర వివాహం వేడుకలో పాల్గొన్న దద్దాల, గంగసాని



**పామూరు, (సిటిజన్ టైమ్స్) మే: 07**

కంబాలదిన్నె గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు పిచ్చాల తిరుపతి రెడ్డి మనవరాలు రాగ సింధూర వివాహం వేడుక మండలం లోని కంబాలదిన్నె గ్రామంలో గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకకు కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్, పామూరు మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి వైసిపి నాయకులతో కలిసి పాల్గొని నూతన వధువును ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారితోపాటు చప్పిడి సుబ్బయ్య, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి, ఓకే రెడ్డి,కొల్ల రమణయ్య చౌదరి, పోలుబోయిన నరసింహులు, నీలం వెంకటేశ్వర్లు, ఇరిగల వెంకటేశ్వర్లు, పెండెం చెన్నకృష్ణ, చింతకుంట్ల రోసిరెడ్డి, ఇరగల తిరుపతిరెడ్డి, పిచ్చాల బ్రహ్మారెడ్డి, అంబటి మాలకొండయ్య రెడ్డి, ఇరగల సతీష్ రెడ్డి, అంబటి మాల్యాద్రి, చింతగుంట్ల దశరథ, గోళ్ళ తిరుపతయ్య చౌదరి, పిచ్చుల చైతన్య రెడ్డి, ఎదురూరి రామచంద్ర రెడ్డి, యర్రగుంట్ల నరసింహ, తొలిసూరి బసవయ్య, యర్ర గొర్ల మల్లికార్జున తదితరులు ఉన్నారు.

# డాక్టరేట్ అందుకున్న వెంకటేశ్వరరావుకు అభినందనలు

**కందుకూరు (సిటిజన్ టైమ్స్) మే: 07**



తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళా శాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులైన ఓరుగంటి వెంకటేశ్వరరావు కి రాజ నీతి శాస్త్రంలో డాక్టరేట్ లభించటం గర్వకార ణము అని తోటి అధ్యా పకులు అన్నారు. వీరికి కళాశాల తరఫున ప్రత్యే కమైన అభినందనలు తెలియజేస్తూ ప్రిన్సిపల్ దాసరి శిరీష, అధ్యాప కులు కాశీరత్నం , బాబు రావు, రాజశేఖర్, సుబ్బా రావు, నరసింహ రావు , హజరత్ , మాధవరావు , మాధవి లక్ష్మీ, సీతారా వమ్మ, శివకుమారి, అక్రమ్,ఆసిఫ్, రాజు తదితరులు అభినందనలు తెలిపారు.

# శక్తి యాప్‌తో మహిళలకు భద్రత ఎస్సై విశ్వనాథరెడ్డి





**మార్కాపురం, (సిటిజన్ టైమ్స్) మే: 07**

నేరాలపై విద్యార్థినులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, తమ భద్రత తమ చేతుల్లోనే ఉందని, అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తోనే పోలీసుల సహాయం పొందవచ్చని, అలాగే తమ లొకేషన్‌ను వెంటనే పోలీసులతో పంచుకోవచ్చని మార్కాపురం పట్టణ ఎస్సై విశ్వనాథరెడ్డి విద్యార్థులకు వివరించారు. గురువారం స్థానిక ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఎక్కడైన మహిళలు ఒంటరిగా ఉండి ఇతరులతో ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తినప్పుడు శక్తి టీమ్‌కు సమాచారం అందించాలన్నారు. ఎవరైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, అఘాయిత్యాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రతకై ప్రభుత్వం చేపడుతున్న చర్యలను, శక్తి యాప్ గురించి, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. మహిళలు గృహహింసకు గురైనప్పుడు చేయవలసిన చర్యలను ఆయన వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ బాబు మాట్లాడుతూప్రతి మహిళ తమ ఫోన్ లో శక్తి యాప్‌ను డౌనలోడ్ చేసుకుంటే ఆపదల సమయంలో పోలీసుల సాయం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, శక్తి టిమ్ సభ్యులు విద్యార్థునులు పాల్గొన్నారు.

# లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి శంకుస్థాపన

## ఈఓ గిరిరాజు నరసింహబాబు



**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్) మే: 07**

చిన్న గొల్లపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి మరియు ఆంజనేయస్వామి దేవస్థానంలో దేవస్థానాల పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10వ తేదీన శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు గురువారం దేవస్థానంలో బాలాలయం ఏర్పాటు కార్యక్రమాన్ని నిర్వహించామని, దేవస్థానం పునర్నిర్మాణ పనులను శాస్త్రోక్తంగా, వేద పండితుల సూచనల మేరకు చేపడుతున్నామని తెలిపారు. 8వ తేదీ ఉదయం 8 గంటలకు పాత దేవాలయ నిర్మాణ భాగాలను తొలగించే కార్యక్రమం అలాగే 9వ తేదీ ఉదయం 9 గంటలకు దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నూతన దేవాలయ నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తము లో 10 వ తేదీన శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# గిద్దలూరులో జెడ్పీ బాలికల పాఠశాల విజయోత్సవ ర్యాలీ!

**గిద్దలూరు పెన్ పవర్ మే 7**



కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాల ఫలితాలు ఈ ఏడాది అద్భుతంగా వచ్చాయి .ఈనేపథ్యంలో గిద్దలూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పదో తరగతి ఫలితాలలో కార్పొరేట్ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థునులు రాచర్ల గేట్ సెంటర్ వరకు ఉత్సాహభరితంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ పులి శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించి విద్యార్థినులను అభినందించారు. పాఠశాలలో 186 మంది పరీక్షలకు హాజరుకాగా 168 మంది విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలతో ఉత్తీర్ణులయ్యారు. మండల టాపర్‌గా సి. ఉమాదేవి నిలిచింది. విద్యార్థిని సి. ఉమాదేవి 600 మార్కులకు గాను 582 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ట పెంచిన విద్యార్థినులు ప్రతిభతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందని ప్రాధానోపాధ్యాయులు పొలా నాగభూషన్ రెడ్డితెలిపారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధించడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని విద్యార్థినులు తెలిపారు. పరీక్షలకు ముందు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను మెరుగైన ఫలితాల వైపు నడిపించారని పేర్కొన్నారు. ఏ సబ్జెక్టులో సందేహం వచ్చినా వెంటనే ఉపాధ్యాయులు వివరణ ఇచ్చి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచారని పేర్కొన్నారు. ప్రతిరోజూ నిర్వహించిన పునశ్చరణ పరీక్షలు విద్యార్థులకు మంచి ప్రాక్టీస్‌ను అందించారన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం సహకారం, ప్రోత్సాహం తమ విజయానికి బలమైందని విద్యార్థినులు పేర్కొన్నారు. పాఠశాలలో పాటిస్తున్న క్రమశిక్షణ విద్యార్థుల విజయానికి ప్రధాన కారణమని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి, చదువుపై ఏకాగ్రతకు తోడ్పడిందన్నారు. ఉచిత సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు విద్యార్థులకు ఉచితంగా అందించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లు చదువుకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. ఉచిత విద్యతో పేద విద్యార్థులకు అవకాశాలు ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య అందుబాటులో ఉండటంతో పేద విద్యార్థులు కూడా ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఆహ్లాదకరమైన తరగతి గదులు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన తరగతి గదులు చదువుకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నారని విద్యార్థినులు తెలిపారు. అన్ని వసతులతో ప్రభుత్వ పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన అన్ని విద్యా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. మంచి విద్య అందించే ఉపాధ్యాయ బృందం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని విద్యార్థినులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని ఈ ఫలితాలు నిరూపించాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. బాలికల విద్యలో గిద్దలూరు జెడ్పీహెచ్ఎస్ ఆదర్శం బాలికల విద్యాభివృద్ధికి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు.

# విద్యా సంస్థలు బస్సుల ఫిట్ నెస్ పాటించాలి

## - ఉప రవాణా కమిషనర్ సుశీల





**ఒంగోలు (సిటిజన్ టైమ్స్) మే: 07**

ప్రకాశం జిల్లాలోని 744 ప్రైవేట్ స్కూలు/కాలేజీ యాజమాన్యాలు ఏ.ఐ.యస్.63 నిబంధనల ప్రకారం బస్సులు ఫిట్ నెస్ ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఉప రవాణా కమీషనర్ ఆర్ .సుశీల పేర్కొన్నారు. గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా స్కూల్ బస్సు యాజమాన్యాలకు రవాణా శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికేట్ , ఇతర అవసరమైన పత్రాలను సమీకరించుకోవాలని సంబంధిత రికార్డులను పూర్తి స్థాయిలో సరిచేసి నిర్వహించాలని సూచించారు. ఏ.ఐ.యస్.63 నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులన్నీ యఫ్.డి.యస్. యస్ యఫ్.ఏ.యస్., యఫ్.పి.యస్, యఫ్.ఏ.బి, అత్యవసర ద్వారము, అత్యవసర కిటికీలు అన్ని కిటికీలకు హారిజంటల్ రైలింగ్స్, వి.ఎల్.టి.డి.స్పీడ్ లిమిట్ జిపిఎస్ సిస్టం, ప్యానిక్ బటన్స్ తదితర భద్రత పరికరాలను అమర్చుకోవాలని తెలిపారు. హెవీ లైసెన్స్ కలిగి అయిదు సంవత్సరముల అనుభవములు కలిగి 60 సంవత్సరముల లోపల వున్న వ్యక్తులను డ్రైవర్ లు గా నియమించుకోవాలని, ఫిట్నెస్ సర్టిఫికెట్ ఏటిఎస్ వద్ద నుండి పొందిన తర్వాత ప్రతి బస్సును ఉప రవాణా కమిషనర్ వారి కార్యాలయం, ఒంగోలు, దర్శి, కందుకూరు నందు వాహన తనిఖీ అధికారుల ఎదుట హాజరు పరచాలని అన్నారు. స్కూల్ కాలేజీ బస్సులు ఏ.ఐయస్. 63 నిబంధనలు అన్ని కూడా అమర్చి ఉన్నాయా లేదా అని పరిశీలించేందుకు తప్పని సరిగా రవాణా శాఖ అధికారుల ముందు హాజరు పరచాలన్నారు. ఏప్రిల్ ఇప్పటివరకు గత నెల 28 నుండి జూన్ 06 వరకు 22 స్కూల్, కాలేజి యాజమాన్యాలకు చెందిన 148 స్కూల్.. కాలేజి బస్సులను ఏ.ఐ.యస్ 63 నార్మ్స్ ప్రకారం తనిఖీలు చేయడం జరగిందని తెలిపారు. 148 వెహికల్స్ ఏ.ఐ.యస్-63 నార్మ్స్, అన్ని తనిఖీ చేయగా అందులో 100 బస్సులకు ఏ.ఐ.యస్- 63 నిబంధనల ప్రకారం ఉన్నాయని 48 బస్సులను తిరిగి ఏ.ఐ.యస్-63 నిభందనలు ప్రకారం సరి చేసుకోవలసిందిగా కోరుతూ వెనక్కి తిప్పి పంపడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు స్కూల్, కాలేజి బస్సుల యాజమాన్యం వారి బస్సులకు ఫిట్నెస్ కొరకు ఎ.టి.ఎస్ సెంటర్ నందు ఫిట్ నెస్ చేయించుకొని ఉప రవాణా కమీషనర్ వారి కార్యాలయము నందు మరల ఆ కాలేజి బస్సులను వాహన తనిఖీ అధికారుల ఎదుట హాజరు పరచవలసినదిగా కోరారు. నిబంధనలకు అనుగుణంగా లేని యెడల వాహనములు సీజ్ చేయడం జరుగుతుందని, ప్రతి స్కూల్ కాలేజీ బస్సుల యాజమాన్యం తప్పనిసరిగా నిబంధనలు పాటించి స్కూల్/ కాలేజీ ప్రారంభించేలోగా నవీకరణ చేసుకోవలసిందిగా ఉప రవాణా కమీషనర్ సుశీల కోరారు.



కృతి శెట్టి ఎలిగెంట్ ఎత్నిక్ గ్లామ్‌లో మెరిసింది

# హీరోలే డూప్‌లు వాడేస్తుంటే ఇంత సాహసం ఎందుకు?

గత కొంత కాలంగా స్టార్ హీరోలు పాన్ ఇండియా సినిమాలకు హై రిస్క్ ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం బాడీ డబుల్‌ని వాడేస్తున్నారని, సాహసాలు చేయడానికి ఇష్టపడటం లేదని, అయితే ఈ విషయాన్ని హీరోలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని నటుడు, డైరెక్టర్ రవిబాబు ఇటీవల ఓ బాంబ్ పేల్చిన విషయం తెలిసిందే. హీరోలు ఇలా రిస్క్ యాక్షన్ సీన్‌ల విషయంలో బాడీ డబుల్స్‌ని వాడేస్తుంటే హీరోయిన్ రష్మిక మందన్న మాత్రం అందుకు పూర్తి భిన్నంగా రిస్క్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గత ఏడాది పలు క్రేజీ సినిమాల్లో నటించి టాక్ ఆఫ్ ది ఇండియాగా నిలిచిన రష్మిక ప్రస్తుతం భర్త విజయ్ దేవరకొండతో కలిసి -రణబాలి-లో నటిస్తూనే ఓ పవర్ ఫుల్ స్టోరీతో రూపొందుతున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా -మైసా-లో నటిస్తోంది. దీనికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక ఈ సినిమా కోసం ఎంత రిస్క్ చేయడానికైనా వెనుకాడటం లేదు. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేని విధంగా రష్మిక మందన్న ఓ సాహసం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ కోసం గోండు తెగకు చెందిన మువతిగా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతోంది. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ సినిమా కోసం రష్మిక తాజాగా పెద్ద రిస్కే చేసిందని తెలిసింది. ఆ విషయాన్ని స్వయంగా డైరెక్టర్ రవీంద్ర పుల్లె వెల్లడించడంతో అంతా షాక్ అవుతున్నారు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక పాత్ర చాలా ప్రభావ వంతంగా ఉంటుందని, ఆమె ప్రదర్శించే కోపం, ఆవేః ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయన్నారు.

ఇటీవల కేరళలోని అతిర జలపాతం వద్ద అత్యంత క్లిష్టమైన ఓ యాక్షన్ సీన్‌ని షూట్ చేశాం. అయితే ఈ సన్నివేశం కోసం రష్మిక 80 అడుగుల ఎత్తు నుంచి ఎలాంటి డూప్ లేకుండా దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా పట్ల, నటన పట్ల ఆమెకున్న నిబద్ధతను చూసి టీమ్ అంతా ఆశ్చర్యపోయాం- అన్నారు.అయితే ఈ విషయం తెలిసిన నెటిజన్‌లు, అభిమానులు మాత్రం స్టార్ హీరోలే రిస్కీ యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడానికి భయపడుతున్నారు. ఇందు కోసం బాడీ డబుల్‌లని వాడేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి డూప్ లేకుండా ఇలా రిస్క్‌లు చేయడం అవసరమా? అని వాపోతున్నారు. 80 అడుగుల ఎత్తులో నుంచి దూకడం అనేది కరెక్ట్ కాదని, ఇకపై అలాంటి రిస్క్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.






సోనాల్ చౌహాన్ యొక్క పూల్‌సైడ్ ఫోటోషూట్ వైరల్‌గా మారింది

# పాట్ కమిన్స్‌కు రూ.113 కోట్ల భారీ ఆఫర్.. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు క్రికెట్ ఆస్ట్రేలియా చెక్!

- ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్‌కు భారీ ఆఫర్
- దేశం తరపున ఆడేందుకు సుమారు రూ.113 కోట్ల కాంట్రాక్ట్
- ఫ్రాంచైజీ లీగ్స్ ఆఫర్ల నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం
- ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ కెప్టెన్‌గా జట్టుకు అగ్రస్థానం
- పంజాబ్‌పై విజయం అనంతరం జట్టు ప్రదర్శనపై కమిన్స్ ప్రశంసలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే కెప్టెన్ పాట్ కమిన్స్‌ను తమతోనే అట్టిపెట్టుకునేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కనీవినీ ఎరుగని రీతిలో భారీ కాంట్రాక్ట్‌ను ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌కు ప్రాధాన్యతనిస్తూ, దేశం తరఫున ఆడేందుకు గాను కమిన్స్‌కు మూడేళ్ల కాలానికి 12 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 113 కోట్లు) దీర్ఘకాలిక ఒప్పందాన్ని ఆఫర్ చేసినట్లు సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ తన కథనంలో పేర్కొంది. దీని ప్రకారం కమిన్స్ ఏడాదికి 4 మిలియన్ డాలర్లు సంపాదించనున్నాడు.ప్రపంచవ్యాప్తంగా తమ ఫ్రాంచైజీ తరపున టీ20 లీగ్స్‌లో ఆడేందుకు గాను, ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ సుమారు 10 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల (సుమారు రూ.62.22కోట్లు) ఆఫర్ ఇచ్చిందన్న వార్తల నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం కమిన్స్ ఆడే మ్యాచ్‌ల సంఖ్యతో సంబంధం లేకుండా ఈ భారీ మొత్తం అందుతుంది.ఈ విషయంపై క్రికెట్ ఆస్ట్రేలియా హెడ్ ఆఫ్ క్రికెట్ జేమ్స్ ఆల్సాప్ మాట్లాడుతూ.. "కమిన్స్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లకు దీర్ఘకాలిక భద్రత కల్పించడం మా బాధ్యత. పాట్, జోష్ హేజిల్‌వుడ్ వంటి మల్టీ-ఫార్మాట్ ప్లేయర్లకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. వారిని ఆస్ట్రేలియా క్రికెట్‌కు కట్టుబడి ఉండేలా చూడటం మా ప్రధాన లక్ష్యం" అని వివరించారు.

అంతర్జాతీయ క్రికెట్‌లో కమిన్స్ భవిష్యత్తుపై ఇలాంటి చర్చ జరుగుతుండగానే, ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా అద్భుతంగా రాణిస్తున్నాడు. నిన్న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో రాణించిన కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. విజయం అనంతరం కమిన్స్ మాట్లాడుతూ.. "మా ప్రదర్శన చాలా సమర్థవంతంగా ఉంది. బ్యాటర్లు అద్భుతమైన స్కోరు అందించారు. పంజాబ్ వంటి బలమైన జట్టుపై రెండోసారి బౌలింగ్ చేసి గెలవడం సులభం కాదు. కానీ మా బౌలర్లు చాలా చక్కగా రాణించారు" అని జట్టును ప్రశంసించాడు.

# ముంబై ఇండియన్స్‌కు డబుల్ షాక్.. కెప్టెన్, వైస్ కెప్టెన్ దూరం!

- పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్
- మిగిలిన నాలుగు మ్యాచ్‌లు గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు
- ఆర్సీబీతో కీలక మ్యాచ్‌కు ముందు జట్టులో కెప్టెన్సీ సంక్షోభం
- పాండ్యా, సూర్య అందుబాటులో లేకుంటే రోహిత్‌కు కెప్టెన్సీ?




ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ ఆశలు నిలబెట్టుకోవడానికి తీవ్రంగా పోరాడుతున్న ముంబై ఇండియన్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలిచి కష్టాల్లో ఉన్న జట్టుకు ఇప్పుడు కెప్టెన్సీ సంక్షోభం పట్టుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరగనున్న కీలక మ్యాచ్ కోసం రాయ్‌పూర్‌కు వెళ్లిన జట్టు మొదటి బృందంలో కెప్టెన్ హార్దిక్ పాండ్యా, స్టాండ్-ఇన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.వెన్నునొప్పితో బాధపడుతున్న హార్దిక్ పాండ్యా, లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు మే 10న ఆర్సీబీతో జరగనున్న చావో రేవో మ్యాచ్‌కు కూడా అతను అందుబాటులో ఉండటంపై సందేహాలు నెలకొన్నాయి. ముంబై నుంచి రాయ్‌పూర్‌కు వెళ్లిన తొలి బృందంలో హార్దిక్ లేడు. మరోవైపు, గత మ్యాచ్‌లో జట్టును నడిపించిన సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి బృందంలో ప్రయాణించలేదు.

ఈ పరిస్థితుల్లో ఒకవేళ హార్దిక్, సూర్యకుమార్ ఇద్దరూ అందుబాటులో లేకపోతే, ఆర్సీబీతో మ్యాచ్‌కు రోహిత్ శర్మ మళ్లీ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడా? అనే చర్చ మొదలైంది. రోహిత్ శర్మ ఇప్పటికే తొలి బృందంతో పాటు రాయ్‌పూర్‌కు చేరుకున్నాడు. అయితే, మ్యాచ్‌కు ఇంకా సమయం ఉండటం, ముంబై-రాయ్‌పూర్ మధ్య విమాన సర్వీసులు తక్కువగా ఉండటంతో ఆటగాళ్లు వేర్వేరు బృందాలుగా వెళ్తున్నారని జట్టు వర్గాలు చెబుతున్నాయి.

ఈ సీజన్‌లో ఇప్పటివరకు 10 మ్యాచ్‌లలో కేవలం 3 విజయాలు సాధించి, 6 పాయింట్లతో ఉన్న ముంబై.. ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌లలోనూ తప్పక గెలవాలి. హార్దిక్ గాయంపై ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ మాట్లాడుతూ "అతడికి వెన్నునొప్పి ఉందని ఈ మధ్యాహ్నమే నాకు తెలిసింది. గాయం తీవ్రతపై నాకు పూర్తి సమాచారం లేదు. కానీ, త్వరలోనే అతను మాతో కలుస్తాడని ఆశిస్తున్నాను" అని వివరించాడు.

# మార్ష్ విధ్వంసక సెంచరీ, పంత్ మెరుపులు.. ఆర్సీబీ ముందు భారీ లక్ష్యం

- లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ల విధ్వంసం
- మిచెల్ మార్ష్ 56 బంతుల్లోనే 111 పరుగులతో అద్భుత సెంచరీ
- చివర్లో 10 బంతుల్లో 32 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్
- వర్షం కారణంగా మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదింపు
- డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం
- ఛేజింగ్ లో కోహ్లీ డకౌట్




కీలక మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో (ఆర్సీబీ) జరుగుతున్న మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ (111) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో లక్నో జట్టు భారీ స్కోరు సాధించింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. లక్నోలోని ఏకానా స్టేడియంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం బెడిసికొట్టింది. ఆది నుంచే దూకుడుగా ఆడిన మిచెల్ మార్ష్, ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 111 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. మరోవైపు, ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడాడు.

మార్ష్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (38) కూడా తనదైన శైలిలో రాణించాడు. ఇక చివర్లో కెప్టెన్ రిషభ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్ తో చెలరేగాడు. కేవలం 10 బంతులు ఎదుర్కొన్న పంత్.. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో లక్నో స్కోరు 200 పరుగులు దాటింది. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ తలో వికెట్ పడగొట్టారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 19 ఓవర్లలో 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

**భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి డబుల్ షాక్.. డకౌటైన కోహ్లీ!**

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ ఆదిలోనే కష్టాల్లో పడింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఈ ఛేదనలో బెంగళూరు 1.4 ఓవర్లలోనే కేవలం 10 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఆర్సీబీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జాకబ్ బెతెల్ (4) మహమ్మద్ షమీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే, ప్రిన్స్ యాదవ్ వేసిన రెండో ఓవర్లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (0) రెండు బంతులు మాత్రమే ఆడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ డకౌట్‌గా వెనుదిరగడంతో ఆర్సీబీ శిబిరంలో నిరాశ ఆవరించింది.ప్రస్తుతం క్రీజులో దేవదత్ పడిక్కల్ (0), కెప్టెన్ రజత్ పటీదార్ (1) ఉన్నారు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే మిగిలిన బ్యాటర్లు అసాధారణ రీతిలో రాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776